క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శివారు రెడ్డిపాలెం సెంటర్‌లోని శ్రీ బాలాజీ క్లినిక్ ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తెనాలి కిమ్స్ ఆసుపత్రి వారి సహకారంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి వారంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు సత్రం లీజు రద్దు చేయండి



బాపట్ల: బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రాన్ని లీజుకు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్ సత్యనారాయణను మంగళవారం కలిసి శ్రీపేరం గరుడాచలం నాయుడు దానంగా ఇచ్చిన భూమిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు అద్దెకు ఇచ్చే ప్రతిపాదనను మానుకోవాలని సూచించారు. అద్దెకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఉద్యమిస్తామని తెలిపారు.

రేపు మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల

నగరం: మండలంలోని ఏలేటిపాలెం గ్రామ దేవత శ్రీమద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని ఈనెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజేశ్వరరావు చెప్పారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శ్రీ మద్దిరాలమ్మ తల్లి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

నగరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి వి రమేష్‌బాబు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల వద్ద గిట్టుబాటు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో ఇప్పటి వరకు 1500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. 1061 రకం ధాన్యాన్ని 75 కేజీల బస్తాను రూ.1650లకు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని విక్రయించేవారు రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసు దాడులు

ఇద్దరు వ్యక్తులు, రెండు కోళ్ల స్వాధీనం

బాపట్లటౌన్: కోడిపందేల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేసిన సంఘటన మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. జమ్ములపాలెం స్మశానవాటిక సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో రూరల్ సీఐ శ్రీహరి తన సిబ్బందితో దాడి చేశారు.ఈ దాడుల్లో రెండు కోళ్లు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 25న ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

అంకిత భావంతో విధులు చేపట్టండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ



హాజరైన పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ

రేపల్లె రూరల్: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు వైద్యులు సహనంతో కూడిన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.విజయమ్మ అన్నారు. గర్భిణులు, బాలింతల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వీరి ఆరోగ్య వివరాలను ఫోన్లలో ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో నమోదు చేసే విధానంపై ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ వైద్యశాల సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లి బిడ్డను ప్రసవిస్తే ఆ ప్రసవం సక్రమంగా జరగటానికి కారకులైన వైద్యులు దైవ సమానులని సహనాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ వీడరాదని సూచించారు. మహిళ గర్భిణీ అయినప్పటి నుంచి ఆమెకు సరైన వైద్యసేవలు అందించటంతో పాటు నిత్యం ఆమె ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించాలన్నారు. వైద్యశాలలో అన్నివేళలా గర్భిణులకు చికిత్సలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. గర్భస్థ సమయంలో శిశువు ఆరోగ్యంగా ఉన్నదీ లేనిదీ, బిడ్డ పెరుగుదల సక్రమంగా ఉందో లేదో పరిశీలించటంతో పాటు ఆమె ఆరోగ్య వివరాలను రికార్డుల లో పొందుపరచాలన్నారు. గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువా, మగ శిశువా అన్నది ఎట్టి పరిస్థితుల్లోనూ బిడ్డ తల్లిదండ్రులకు తెలపరాదని, భ్రూణ హత్యల నివారణకు కృషి చేయాలని చెప్పారు. గర్భిణీలు మందులు వాడే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించాలని, ప్రభుత్వ వైద్యశాలలోనే అధిక కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవానంతరం తల్లీ, బిడ్డలు క్షేమంగా ఇంటికి చేరేలా కృషి చేయాలన్నారు. బాలింత మహిళ తన బిడ్డపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను సిబ్బంది వివరించాలన్నారు. వైద్యసేవలు అందించటంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. తల్లీ బిడ్డల క్షేమంతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని సూ చించారు. అనంతరం గర్భిణుల వివరాలను యాప్‌లలో నమోదు చేసే ప్రక్రియను వివరించారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు రమేష్, జీవన లత, రవిబాబు, అబ్దుల్ సమద్, కిషోర్, రాజశేఖరరెడ్డి, జాన్ ప్రసాద్, నాగార్జున, తల్పు సాయిబాబు, శ్రవణ్య, నాజీ, తులసి, మంజుల, భావన, సాలేహా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి లక్ష మల్లెల పూజ



పూజలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో అమ్మవార్లు

కర్లపాలెం: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి మంగళవారం భక్తులు లక్ష మల్లెల పూజ నిర్వహించారు. కర్లపాలెం మండల పరిధిలోని ఏట్రవారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి వైశాఖ మాసం సందర్భంగా శుద్ధ త్రయోదశి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సింధూరార్చన, లక్ష మల్లెల పూజ, నాగవల్లి దళ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రతిమలు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

కట్లమ్మ తల్లి మహోత్సవాలు ప్రారంభం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన శ్రీ కట్లమ్మతల్లి 26వ వార్షిక మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి నిత్య పూజ చేపట్టారు. భక్తులు చద్ది నైవేద్యములు సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు. బుధవారం అమ్మవారి పావన నదీస్నానం, గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. కార్యక్రమాన్ని కట్లమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.

రోగులకు నిరంతరాయ వైద్య సేవలు



కర్లపాలెం: మండల ప్రజలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలూ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారి ఎ.గోపీనాథ్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, రక్తహీనత ఉన్న వారికి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అవసరమైన వారికి రక్త పరీక్షలు చేస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నియమిత సమయాలలో డాక్టర్ అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తారని వివరించారు. అనంతరం స్టాఫ్ నర్సులు వైద్యశాలలో అందుబాటులో ఉంటారని చెప్పారు. అత్యవసరం మేరకు వైద్యుల సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నరకప్రాయంగా రహదారి ప్రయాణం

కంకర, ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లపై పరదాలు లేక వాహనదారుల అవస్థలు



టార్పాలిన్ పరదా లేకుండా ట్రాక్టర్‌లో ఇటుక బట్టీ కంకర తరలింపు

కొల్లూరు : ట్రాక్టర్ డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు కళ్లు మట్టితో నిండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఇటుక బట్టీల్లో వచ్చే కంకర, ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లపై టార్పాలిన్ పరదాలు లేకుండా రహదారులపై ప్రయాణిస్తుండటంతో ద్విచక్ర వాహనదారుల ప్రయాణం నరక ప్రాయంగా మారుతుంది. టార్పాలిన్ పరదాలు లేకుండా లంక గ్రామాల నుంచి ట్రాక్టర్ యజమానులు చేస్తున్న రవాణా కారణంగా ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వాహనదారులు ట్రాక్టర్ ట్రక్కుల నుంచి గాలికి ఎగసిపడే ఇటుక బట్టీల్లో కంకర, బుసక, ఇసుక కళ్లలో పడి అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ట్రాక్టర్ల నుంచి కళ్లు నిండిపోయేలా పడుతున్న దుమ్ము, ధూళి కారణంగా కంటి సంబంధిత వ్యాధులకు గురవడంతో పాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పోలీసు యంత్రాంగం స్పందించి టార్పాలిన్‌లు లేకుండా ట్రాక్టర్ల ద్వారా చేపడుతున్న రవాణాను అరికట్టాలని వాహనదారులు కోరతున్నారు.

24 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

రేపల్లె రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి కేశనశెట్టి సురేష్ తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌ను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొత్తంగా 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 24 నుంచి జూన్ 2 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొల్లూరు: ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని కొల్లూరు మండల వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలోని కొల్లూరు, క్రాప, దోనేపూడి, రావికంపాడు, ఈపూరు, జువ్వలపాలెం, పోతార్లంక, గాజుల్లంక రైతు భరోసా కేంద్రాల్లో జనుము, పిల్లిపెసర విత్తనాలు రైతాంగం పొందవచ్చునన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు రాయితీ సొమ్ము పోను మిగిలిన నగదు చెల్లించాలని తెలిపారు. ఒక్కో రైతు 5 ఎకరాల వరకు విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

గుంటూరు రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రశాంత జీవనానికి పోలీస్ వ్యవస్థ నిరంతరం కృషి చేస్తుందని సౌత్ డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు, లాలుపురం, లింగాయపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామాల్లో ఆర్మ్‌డ్ ఫోర్స్, పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యి కౌంటింగ్‌కు దగ్గర పడుతున్న సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు కవాతు నిర్వహించటం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణ చేశామన్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతును నిర్వహించామన్నారు. ప్రజా సంరక్షణ పోలీస్ బాధ్యతగా చేపట్టటం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకు వస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. కాలనీలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆర్మ్‌డ్ ఫోర్స్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల మండలి కార్యదర్శి ఎన్నిక



కర్లపాలెం: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్లా రాజారావు నియమించారని కర్లపాలెంకు చెందిన కుమ్మరకుంట రవికుమార్ మంగళవారం తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ప్రధాన కార్యదర్శిగా నియమించినం దుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కులను పరిరక్షిస్తానని రవికుమార్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రవికుమార్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు రూరల్: ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసిన వ్యక్తిని నల్లపాడు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అడవితక్కెళ్లపాడు రాజీవ్ గృహకల్పకు చెందిన మైనర్‌బాలిక స్థానికంగా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అక్కడే నివాసం ఉండే షేక్ యాసిన్ బాలికను ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించాడు. స్కూలుకు వెళుతున్న సమయంలో వెంటపడి ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని శివారు ప్రాంతాల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడేవాడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కండి



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్నల్ సీఎస్ సిద్దు

యనమదల (ప్రత్తిపాడు): ఎన్‌సీసీ క్యాడెట్లకు దేశంపై గౌరవం, సమాజం పట్ల బాధ్యత ఉండాలని గుంటూరు 25వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సీఎస్ సిద్దు అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గుంటూరు 25ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించారు. శిక్షణకు గుంటూరు-పల్నాడు గ్రూపుకు చెందిన 10 కళాశాలలు, 30 పాఠశాలల నుంచి 638 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా కల్నల్ సీఎస్ సిద్దు హాజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్లు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు దేశంలోని వివిధ రకాల సంస్కృతి సంప్రదాయాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ సమాజంలో ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదగాలన్నారు. ఎన్‌సీసీలో విద్యార్థి దశ నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆప్టికల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, గన్ ఫైరింగ్, ఫిజికల్ ఎక్సర్‌సైజెస్, డ్రిల్ ట్రైనింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఆహ్లాదం కోసం ఆటల పోటీలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను శిబిరంలో నిర్వహిస్తామని తెలిపారు. కళాశాలలో ట్రైనింగ్ క్యాంప్‌కు అవకాశమిచ్చిన కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ విజయ్ మోహితే, క్యాంపు అడ్జంట్ మేజర్ కుమార్ రాజా, కళాశాల సిబ్బంది బి మల్లికార్జున రావు, ఆర్మీ సిబ్బంది, సివిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నృసింహస్వామి జయంతి



పంచామృత అభిషేకంలో పరశివానంద భారతి, ఛైర్‌పర్సన్ రాధిక తదితరులు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి జయంతి వ్రతం, పంచామృత అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీపరశివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాన్ని కన్నుల పండువగా జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివరామిరెడ్డి, ఎస్.బాలసుబ్రహ్మణ్యం, విజయకుమారి, భార్గవ్ పర్యవేక్షించారు. జూన్ ఒకటో తేదీన శ్రీహనుమత్ జయంతి సందర్భంగా అభయ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన ఉంటాయని చంద్రశేఖరరెడ్డి తెలిపారు. జూన్ అయిదో తేదీన శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నసమారాధన ఉంటాయని, భక్తులు విచ్చేసి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్వామివారి పంచామృత అభిషేకాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక-రమేష్ దంపతులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వివిధ రంగాల ముఖ్యులు పాల్గొన్నారు.